
సాక్షి ఒడిశా

బుధవారం । 24 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,97,118, బంగారం గ్రాము, వెండి 11.3 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



వినువీధిన రెపరెపలు

- రాజ్‌భవన్ ఆవరణలో భారీ జాతీయ పతాకం ఆవిష్కరణ

-8లో

మీ ఫోన్ దొరికింది.. వచ్చి తీసుకోండి



- 58 సెల్‌ఫోన్లు రికవరీ చేసిన పోలీసులు

-8లో

న్యూస్‌రీల్

హత్య కేసులో నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: నగర శివారు లాటీ–సుకుండా రహదారిలో ఈనెల 12న జరిగిన యువకుడి హత్య కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఐఐసీ అధికారి జితేంద్ర మల్లిక్ మంగళవారం వెల్లడించారు. సదర్ పోలీసు స్టేషన్ పరిధిలోని లాటీ–సుకుండా రహదారిలో పాతకక్షల కేంద్రంగా ప్రత్యర్థి వర్గానికి చెందిన దుండగులు బౌరిబొంద గ్రామానికి చెందిన గౌరంగా దాస్ అనే యువకుడిని హత్య చేసి, పరారయ్యారు. దీనికి సంబంధించి మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ సరవణ్ వివేక్ ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించారు. వివిధ ప్రాంతాల్లో గాలించిన సిబ్బంది.. హత్యతో ప్రమేయం ఉన్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. నిందితులు బౌరిబొంద గ్రామానికి చెందిన రింకు దాస్(34), చందన్ దాస్(25)గా గుర్తించారు. వారి నుంచి 2 బైకులు, మారణాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు.

దివ్యాంగులకు పథకాలు వర్తింపజేయాలి

- డీఎల్‌ఎస్‌ఏ అధికారి రబినారాయణ బెహరా



మాట్లాడుతున్న సమర్థ్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మహారాణా

పర్లాకిమిడి: దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర పథకాలు అందేలా చర్యలు తీసుకోనున్నామని జిల్లా న్యాయసలహా ప్రాధికారణ(డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి రబినారాయణ బెహరా అన్నారు. రాయఘడ సమితి కార్యాలయంలో దివ్యాంగ వీక్‌లాంగ్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని డీఎల్‌ఎస్‌ఏ, సమర్థ్ దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో 21 పంచాయతీల నుంచి 40మంది దివ్యాంగులు పాల్గొని, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శికి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురికి వీల్‌చైర్స్, త్రిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగుల ఇళ్లకు వెళ్లిన ఆయన.. ఆర్థిక, సామాజిక పరిస్థితిని పరిశీలించారు. వారి వినతులను పరీక్షించి, పరిష్కరించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈనెల 29 వరకు ఈ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నామని సమర్థ్ అధ్యక్షుడు సంతోష్ మహారాణా తెలిపారు. కార్యక్రమంలో రాయఘడ బీడీఓ సుధీర్‌కుమార్ సింగ్, రాయఘడ చైర్‌పర్సన్ పూర్ణబాసి నాయక్, బ్లాక్ సామాజిక భద్రతాధికారి నమితాచాంద్ నాయక్, జిల్లా సామాజిక భద్రతా అధికారి సంతోష్‌కుమార్ నాయక్, సమర్థ్ చైర్మన్ నిరంజన్ బెహరా, సంతోష్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



రాణిపేట రోడ్డులో యంత్రాల సాయంతో చేపడుతున్న పనులు



విద్యుత్ లైన్లు సరిచేస్తున్న టాటా సిబ్బంది

పర్లాకిమిడి: కాల వైశాఖితో గజపతి జిల్లా కాశీనగర్ సమితి రాణిపేట పంచాయతీలో ఆదివారం అర్ధరాత్రి భారీ ఈదురుగాలులు సంభించాయి. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది వెంటనే స్పందించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాల పునరుద్ధరణ పనులు సోమవారం నుంచి చకచకా పూర్తిచేస్తున్నారు. దీంతో గత 2రోజులుగా విద్యుత్ అంతరాయంతో అవస్థలు ఎదుర్కొన్న కాశీనగర్ సమితి రాణిపేట, గుమ్మా బ్లాక్ వినియోగదారులకు సరఫరాను పునరుద్ధరించారు. క్రేన్ల సాయంతో టాటా పవర్ కంపెనీ సిబ్బంది ఈ పనుల్లో పాల్గొన్నారు. ఇదిలా వుండగా కాలవైశాఖి మంగళ, బుధవారాల్లో కొనసాగనున్నట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం(ఐఎండీ) అధికారి ఉమాశంకర్ దాస్ తెలిపారు. దీని ప్రభావం ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాలో 14జిల్లాలపై చూపనుందన్నారు. మంగళవారం ఉదయం పర్లాకిమిడిలో కొద్దిపాటి మబ్బులు ఏర్పడినా.. 10గంటల తరువాత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉత్కళ.. మురిసిన వేళ..



అనుప్ దాస్ (38), ఒడిశా టాపర్



- యూపీఎస్సీ ఫలితాల్లో రాణించిన ఒడిశా అభ్యర్థులు
- జాతీయ స్థాయిలో 38వ ర్యాంకుతో మెరిసిన అనూప్ దాస్
- ప్రణిత దాస్‌కు 42, ఆర్నవ్ మిశ్రాకు 56వ ర్యాంకు
- రాష్ట్రం నుంచి మొత్తం 18మంది అర్హత



భువనేశ్వర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్ సర్వీసెస్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన అనూప్ దాస్ 38వ ఆల్ఇండియా ర్యాంక్‌తో ఒడిశా నుంచి టాపర్‌గా నిలిచాడు. అతను ఇండియన్ ఫారిన్ సర్వీస్‌ను ఎంచుకునేందుకు మక్కువ కనబరుస్తున్నారు. ప్రస్తుతం అనూప్ దాస్ ఢిల్లీలో ఐఆర్ఎస్ అధికారిగా కొనసాగుతున్నారు. జంతుశాస్త్రం ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టానికి ప్రత్యామ్నాయం లేదని, అయితే పరీక్షలో విజయం సాధించడానికి తెలివిగా పని చేయాలని ఔత్సాహికులకు సూచించారు. అలాగే ప్రణిత దాస్, అర్నవ్ మిశ్రా జాతీయ స్థాయిలో వరుసగా 42, 56వ జాతీయ ర్యాంకులతో రాష్ట్రంలో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరి తర్వాతి స్థానంలో 66వ ర్యాంకుతో కృతిక మిశ్రా, 67వ జాతీమ ర్యాంకుతో కస్తూరి పండా ఉత్తీర్ణత సాధించడం విశేషం. రాష్ట్రానికి చెందిన 18మంది అభ్యర్థులు ఈసారి యూపీఎస్సీ పరీక్షలో సత్తాచాటారు. ఒడిశా సివిల్ సర్వీసెస్(ఓసీఎస్) పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించిన తేజస్విని బెహరా యూపీఎస్సీ జాబితాలో 516 స్థానంలో నిలిచారు.

అమ్మాయిలే అధికం..

రాష్ట్రం నుంచి యూపీఎస్‌సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిలో సౌమ్య రంజన్ దాస్(136), సోనాలి మిషా(140), దుర్గాప్రసాద్ అధికారి(162), లక్ష్మీప్రియ ఉపాధ్యాయ్(176), శోభాంగి ఖుంటియా(248), ఆకృతి సెఠి(249), సత్యప్రకాష్ మిశ్రా(261), ఆయుషి ప్రధాన్(334), తేజస్విని బెహరా(516), రాకేష్‌కుమార్ సాహు (575), శుభస్నిగ్ధ సెఠి(680), శుభం మిశ్రా(688), నివేదిత దాస్(848), మానస జ్యోతి దాస్(881), హరేకృష్ణ మెహెర్(931) ఉన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 933మంది అభ్యర్థులకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్(ఐపీఎస్), సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ 'ఎ', గ్రూప్ 'బి'కి నియామకం కోసం సిఫార్సు చేశారు. అభ్యర్థులు సాధించిన మార్కులను 15 రోజుల తర్వాత ప్రకటించనున్నారు. ఈసారి ఉత్తీర్ణత సాధించిన మొత్తం 933 మంది అభ్యర్థుల్లో 345మంది సాధారణ వర్గం(ఓపెన్ కేటగిరీ, 99మంది ఆర్థిక బలహీన వర్గాలు(ఈబీసీ), 263మంది ఇతర వెనుకబడిన వర్గాలు(బీసీ), 154మంది షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ, 72మంది షెడ్యూల్డ్ తెగ(ఎస్టీ)కు చెందిన వారు ఉన్నారు.



శోభాంగి ఖుంటియా



ఆర్నవ్ మిశ్రా



తేజస్విని బెహరా

కేంబ్రిడ్జ్‌లో ఎంఫిల్..



ప్రణతి దాస్(42)

యూపీఎస్సీ కోసం మూడేళ్ల నిరవధికంగా కష్టపడిన ప్రణిత దాస్.. తన మొదటి ప్రయత్నంలోనే సత్తా చాటారు. ప్రస్తుతం ఆమె లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో ఎంఫిల్ చేస్తున్నారు. పరీక్షకు ముందు రివిజన్, ప్రాక్టీస్, మాక్ టెస్టులు ఉత్తీర్ణతకు సహాయపడినట్లు ప్రణతి వివరించింది. యూపీఎస్సీ పరీక్షలో ఆర్థికశాస్త్రం ఆప్షన్‌గా ఎంచుకోగా, ఒడిశా కేడర్‌లో పోస్టింగ్ ఆశిస్తున్నట్లు తెలిపారు.

విజయ రహస్యమిదే..



కస్తూరి పండా(67)

ఎలాంటి కోచింగ్ లేకుండానే కస్తూరి పండా తన రెండో ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించారు. 'నేను సొంతంగా చదువుకున్నాను. గ్రాడ్యుయేషన్‌లో సోషియాలజీ సబ్జెక్ట్‌గా లేకపోయినా సొంతంగా ప్రిపేర్ అయ్యాను. పరీక్షలో విజయం సాధించాలంటే సరైన అంకితభావం, శ్రద్ధ అవసరం. ఇదే నా విజయ రహస్యం' అని ఆమె వివరించారు. రౌర్కెలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్) ఎంచుకో వాలని, సాంకేతికత, విద్య, మహిళల కోసం ప ని చేయాలని ఆమె మనోగతాన్ని వెల్లడించారు.

సెంచూరియన్‌తో మొరాకో ప్రభుత్వం ఒప్పందం



ద్వైపాక్షిక ఒప్పంద సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సుప్రియా పట్నాయక్

- పర్లాకిమిడి క్యాంపస్‌లో నలుగురు అధికారుల బృందం పర్యటన

పర్లాకిమిడి: వాయువ్య ఆఫ్రికా ఖండంలోని మొరాకో దేశం వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు స్థానిక సెంచూరియన్ వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. వ్యవసాయం, చేపల పెంపకం, నైపుణ్యాభివృద్ధి, మినీ డెయిరీ, బ్యాకరీ, డ్రాగన్ ఫ్రూట్, ఉన్నత విద్య టెక్నాలజీ, 3డీ ల్యాబ్ నిర్మాణానికి ఆఫ్రికా–ఇండో ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు నలుగురు సభ్యుల మొరాకో ప్రభుత్వ అధికార బృందం పర్లాకిమిడి సెంచూరియన్ క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ బోర్డు హాలులో జరిగిన విలేకర్ల సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్ మాట్లాడారు. నీతి ఆయోగ్, ఇండో–ఆఫ్రికా ద్వైపాక్షిక సంబంధాల మేరకు మొరాకో ఉన్నత విద్యాభివృద్ధి అధికారి మహ్మద్ తఫ్రీ, అమెరికా–ఆసియా మైత్రి భాగస్వామ్యుల ఇన్‌చార్జి అబ్దుల్లా ఫైజర్, సలహాదారు మొరాకో ఉన్నత విద్యాశాఖ అమల్ లరిబీ వర్సిటీని సందర్శించారని తెలిపారు. అక్కడి దేశంలో పారిశ్రామిక నైపుణ్యం, అనుసంధాన విద్య, వ్యవసాయంలో సాంకేతికత, యాంత్రీకరణ, వస్తు తయారీ, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, ఐటీ తదితర రంగాలలో ఇరుదేశాలు సహకారం అందిపుచ్చుకునేందుకు ఆసక్తి చూపించారని వెల్లడించారు. మొరాకో అధికారి మహ్మద్ తఫ్రీ మాట్లాడుతూ.. సెంచూరియన్‌లతో కలిసి పనిచేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రభుత్వ సంబంధాల అసోసియేట్ డైరెక్టర్ మోనాలిసా ఘోష్, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎస్పీ నందా తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మొరాకో ఉన్నతాధికారి మహ్మద్ తఫ్రీ

పాము కాటుతో వ్యక్తి మృతి



కోరుకొండ పీహెచ్‌సీలో గోవింద మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి చితాపరి పంచాయతీ ఎంవీ–109 గ్రామానికి చెందిన గోవింద విశ్వాస్(45) పాము కాటుతో మంగళవారం మృతి చెందాడు. సోమవారం రాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విషసర్పం ఎడమ చేతిపై కాటు వేసింది. వెంటనే కేకలు వేస్తతూ నిద్ర లేచిన అతను.. పాము కాటు వేసినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బలిమెల పోలీసు ఐఐసీ జాన్‌ఖుజుర్ ఆస్పత్రికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే కారుపై కోడిగుడ్లతో దాడి

- వివాదం మధ్యే ప్రభుత్వ భవాన్ని ప్రారంభించిన రఘురాం పొడాల్



లమతాపుట్‌లో ధ్వంసమైన భవనం శిలాఫలకం



కోడిగుడ్ల దాడి అనంతరం కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్ వాహనం

కొరాపుట్: అధికార పార్టీ బీజూ జనతాదల్‌కు చెందిన కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా సంఘం అధ్యక్షుడు రఘురాం పొడాల్‌పై కోడి గుడ్లతో దాడి జరిగింది. ఈ నేపథ్యంలోకొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి కేంద్రంలో వివాదం చెలరేగాయి. లమతాపుట్‌లో ప్రభుత్వం నూతనంగా పంచాయతీ భవనం నిర్మించింది. దీనికి సంబంధించి ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరు కానున్నారు. ఈ మేరకు భవన శిలాఫలకంపై ఎమ్మెల్యే, కలెక్టర్ పేర్లు ఉన్నాయి. అయితే విపక్ష కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు స్థానిక జిల్లా పరిషత్ సభ్యుల పేర్లు లేవు. దీనిని గమనించిన ఆ పార్టీ కార్యకర్తలు అధికారులను నిలదీశారు. దీనిపై అధికారుల నుంచి స్పందన కరువైంది. ఇంతలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఎమ్మెల్యే రఘురాం భవనం ప్రారంభించేందుకు కారులో వచ్చారు. అప్పటికే ఆగ్రహావేశాలతో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు.. మార్కెట్ మీదుగా ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్తుండగా కోడి గుడ్లతో దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకునే లోగా పరారయ్యారు. అయితే యథావిధిగా కార్యక్రమ వేదిక వద్దకు చేరుకున్న రఘురాం పొడాల్.. భవనాన్ని ప్రారంభించారు. ఈ ఘటన అనంతరం మరో కార్యకర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'సామూహిక సెలవులే శరణ్యం'



కలెక్టర్ కమలోచన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులు

కొరాపుట్: రాష్ట్రవ్యాప్తంగా మినిస్టీరియల్ ఉద్యోగులు సాముహిక సెలవు పెడతామని ప్రకటించారు. ఈ మేరకు నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రాకు మంగళవారం వినతిపత్రం అందించారు. తమ వేతనాలు పెంచాలని పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై ఏప్రిల్ 21న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు వినతిపత్రం సమర్పించామని గుర్తుచేశారు. ఏప్రిల్ 30 లోగా స్పందన లేకపోవడంతో మే 1న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందించామన్నారు. మే 22నుంచి నల్ల బాడ్జీలతో విధులకు హాజరవుతున్నామని తెలిపారు. ఈనెల 30లోగా ప్రభుత్వం స్పందించకపోతే.. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సెలవులు పెడతామని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి బాలాజీసాహు, జిల్లా నాయకులు కైలాష్‌చంద్ర, ఎం.బాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు జేపీఎల్–2023

- ఫైనల్‌లో తలపడనున్న జయపురం రాయల్స్, సూపర్‌స్టార్స్ జట్లు



సురేష్‌కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందిస్తున్న నిర్వాహకులు



సెమీఫైనల్ విజేతలతో వైస్ చైర్‌పర్సన్ సునీత, జస్‌పాల్ సింగ్

జయపురం: స్థానిక పట్టణంలోని విక్రమ క్రీడా మైదానంలో జరుగుతున్న జయపురం ప్రీమియర్ లీగ్(జేపీఎల్) 2023 క్రికెట్ టోర్నమెంట్ తుది దశకు చేరుకున్నారు. ఇందులో భాగంగా జయపురానికి చెందిన రాయల్స్, సూపర్‌స్టార్స్ జట్లు బుధవారం జరగనున్న ఫైనల్‌లో తలపడనున్నట్లు నిర్వాహకులు ఓరియన్ క్రికెట్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం జరిగిన సెమీ ఫైనల్‌లో టాస్ గెలిచిన బ్యాటింగ్ ప్రారంభించిన రాయల్స్ జట్టు 20 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌటైంది. సుకేష్‌కుమార్ హీరా 34 బంతుల్లో 44 పరుగులు, పీకే కుమార్ 33 బంతుల్లో 44 పరుగులు చేశారు. అనంతరం 157 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన దాల్ వారియర్స్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 150 పరుగులు మాత్రం చేయగలిగింది. లక్ష్మీనారాయణ నాయక్ 47 బంతుల్లో 71 పరుగులు చేసినా, జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయాడు. దీంతో రాయల్స్ టీం 6 పరుగుల వ్యత్యాసంతో విజయం సాధించి, ఫైనల్‌కు చేరుకుంది.

పూర్ణ మాఝి ధనాధన్..

మరో సెమీఫైనల్‌లో మౌంటెన్ బాయ్స్–సూపర్ స్టార్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన మౌంటెన్స్ బాయ్స్ టాస్ గెలిచి, బ్యాటింగ్‌కు దిగడంతో పాటు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. సరోజ్ గౌడ 41 బంతుల్లో 48 పరుగులు, ఎ.కిరణ్ 37 బంతుల్లో 50 పరుగులు చేశారు. లక్ష్య ఛేదనలో సూపర్ స్టార్స్ జట్టు 16.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 179 పరుగులతో విజయం సాధించింది. శ్రావణ దుర్గ 40 బంతుల్లో 54 పరుగులు, సుభమ్ సింగ్ 30 బంతుల్లో 51 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. పూర్ణ మాఝి 17 బంతుల్లో 47 పరుగులతో ధనాధన్ ఇన్నింగ్స్ విజయంలో తనదైన ముద్ర వేశారు. దీనితో ఫైనల్‌కు చేరడంతో జయపురం రాయల్స్ జట్టుతో తలపడనుంది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన సురేష్‌కుమార్ హీరాకు రూ.వెయ్యి నగదు బహుమతి అందించారు. మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్ జస్‌పాల్ సింగ్ అతిథులుగా హాజరయ్యారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులపై డీఎల్‌పీఓ విచారణ



విచారణ జరుపుతున్న డీఎల్‌పీఓ గోపీబాల

పొందూరు: పొందూరు మండలంలోని తాడివలస, కోటిపల్లి పంచాయతీ కార్యదర్శులపై ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎల్‌పీఓ ఆర్.గోపీబాల విచారణ జరిపారు. తాడివలస పంచాయతీ కార్యదర్శి బి.వెంకటరావు విధులకు సక్రమంగా రావడం లేదని, సమయ పాలన పాటించడం లేదంటూ సర్పంచ్ తమ్మినేని మణెమ్మ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే కోటిపల్లి పంచాయతీలో సెక్రటరీ రాజశేఖర్ ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీ ఖాతాకు జమ చేయలేదంటూ సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయన విచారణ జరిపారు. దీనిలో భాగంగా పలువురు వలంటీర్ల నుంచి సమాచారం సేకరించారు. విచారణ నివేదికలను జిల్లా అధికారులకు అందించనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. ఆయనతో పాటు మండల పరిషత్ కార్యాలయం ఈవో మురళీ తదితరులు ఉన్నారు.

శరత్‌బాబుకు ఘనంగా నివాళి



శరత్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: సీనియర్ సినీ నటుడు శరత్‌బాబు మృతి ఆమదాలవలసకు తీరని లోటు అని సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జేజే మోహన్‌రావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోగల శ్రీదేవి థియేటర్ ఆవరణలో మంగళవారం శరత్‌బాబు మృతికి సంతాపం తెలుపుతూ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శరత్‌బాబు స్నేహితులు, అభిమానులు, సిటిజన్ ఫోరం సభ్యులు ఎర్నాగుల ప్రభాకరరావు, జేకే వెంకటేశ్వరరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, బొడ్డేపల్లి మోహన్‌రావు, బి.రాజేష్, కుసుమంచి శ్యామ్ ప్రసాద్, శిల్లా రవి, ఆమదాలవలసకు చెందిన కవి కె.వి.రాజారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

శ్రీవారి సన్నిధిలో అన్నమయ్య కీర్తనల ఆలాపన



తిరుపతిలో నిర్వహించిన హరినామ సంకీర్తనంలో కీర్తనలు ఆలపిస్తున్న చిన్నాగురుస్వామి

ఇచ్ఛాపురం: కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలో అన్నమయ్య కీర్తనలు ఆలపించేందుకు అవకాశం లభించిందని స్థానిక శ్రీ వేంకటేశ్వర డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలిపారు. ఆయన మంగళవారం తిరుపతిలో అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు కళాకారులను సత్కరించారు.

వినువీధిన రెపరెపలు

● రాజ్‌భవన్ ఆవరణలో భారీ జాతీయ పతాకం ఆవిష్కరణ



రెపరెపలాడుతున్న హైమాస్ట్ జాతీయ పతాకం



జాతీయ గీతాలాపనలో అతిథి ప్రముఖులు

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో కలిసి మంగళవారం స్థానిక రాజ్‌భవన్ ప్రాంగణంలో హైమాస్ట్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ పతాకం ఇకపై నిత్యం ఆవరణలో రెపరెపలాడనుంది. ఈ సందర్భంగా ఇరువురూ రిమోట్ మీట నొక్కి, హైమాస్ట్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా, రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్, ముఖ్యమంతి ప్రధాన సలహాదారుడు ఆర్.బాలకృష్ణ, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సునీల్‌కుమార్ బన్సాల్, కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సౌమేంద్రకుమార్ ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.



త్రివర్ణ పతాకం వద్ద గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్, ఉన్నతాధికారులు

సిటిజన్ కమిటీ ప్రతిపాదనలు



సమావేశంలో పాల్గొన్న జయపురం సిటిజన్ కమిటీ

జయపురం: పట్టణంలో నెలకొన్న వివిధ సమస్యలపై జయపురం సిటిజన్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. కమిటీ కార్యాలయంలో అధ్యక్షుడు మీనకేతన దాస్ అధ్యక్షతన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో జయపురం అభివృద్ధిపై తీసుకున్న నిర్ణయాలను కార్యదర్శి జి.వెంకటరావు వివరించారు. కమిటీ ఖర్చులు, వార్షిక నివేదికను చదివి, వినిపించారు. చర్చలో మున్సిపాలిటీ వసూలు చేస్తున్న వినియోగ రుసుంతో ప్రజలపై అదనపు భారం పడుతోందని, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. వయోవృద్ధుల సౌకర్యార్థం అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, సాగర్ చుట్టూ గల ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జయపురంలో కేంద్ర విద్యాలయం ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయింపు, రైల్వేస్టేషన్, జిల్లా కేంద్ర ఆస్పత్రికి సిటీ బస్సు సర్వీసులు నడపాలన్నారు. బస్టాండ్‌లో కలాసీలకు చార్జీలు నిర్ణయించాలని, ఆటోలకు మీటర్‌లు ఏర్పాటు చేయడం, వీధుల్లో మాంసం, చేపల దుకాణాలను నియంత్రించాలని విన్నవించారు. చర్చలో వచ్చిన ప్రతిపాదనలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో సత్యభాను పండా, డాక్టర్ సురేష్ దాస్, ఇంజినీర్ కేదారనాథ్ బెహరా, రత్నాకర చౌధురి, దేవేంద్ర బాహిణీపతి, శంకర ప్రహరాజ్, రామ నాయక్, జానకీ పాణిగ్రహి, యాదవ సుబుద్ధి, భవానీ ఆచార్య, పరమేశ్వర పాత్రొ, ఎస్‌కే ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఫోన్ దొరికింది.. వచ్చి తీసుకోండి



సెల్‌ఫోన్లు తిరిగి పొందిన ఆనందంలో ఎస్పీ సుశ్రీతో బాధితులు

● అపహరణకు గురైన 58 సెల్‌ఫోన్లు రికవరీ చేసిన పోలీసులు
● బాధితులకు స్వయంగా అందజేసిన ఎస్పీ సుశ్రీ

కొరాపుట్: ఈ రోజుల్లో సెల్‌ఫోన్ పోయిందనే మాటే ఊహకొస్తే చాలు.. ఎవరికైనా ఊపిరాడనంత పనై పోతుంది. అలా సెల్‌ఫోన్ పోయినవారికి నవరంగ్‌పూర్ జిల్లాలో చల్లటి వార్త అందింది. జిల్లాలోని పలువురు బాధితులకు ఎస్పీ కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం ఫోన్లు వచ్చాయి. మీ ఫోన్ దొరికింది. ఎస్పీ కార్యాలయానికి వచ్చి, తీసుకోవాలని సమాచారం అందింది. దీంతో బాధితులు ఉరుకులు, పరుగులతో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఏర్పాటు చేసి ఉన్న ప్రత్యేక టెంట్‌లో అంతా సేదతీరారు. ఇంతలో ఎస్పీ ఎస్.సుశ్రీ బయటకు వచ్చి బాధితులను పలకరించారు. ఒక్కో పేరు చదువుతూ స్వయంగా సెల్‌ఫోన్లు అప్పగించారు. ఇలా 58మందికి ఫోన్లు అందాయి. ఇందులో చాలా మంది తమ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదు కూడా చేయలేదు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో సైబర్ నేరాలను అదుపులో పెట్టేందుకు యంత్రాంగం పటిష్టం చేశామన్నారు. పోయిన ఫోన్ల ఈఎంఐ ఆధారంగా వాటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన నిందితుల నుంచి కూడా చోరీకి గురైన ఫోన్లు స్వాధీనం అయ్యాయన్నారు. దొంగ ఫోన్లు విక్రయించే వారిపై కూడా నిఘా పెట్టామని, త్వరలో మరింత మంది బాధితులకు లబ్ధి చేకూర్చుతామని వివరించారు. దీంతో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేస్తూ, ఎస్పీ, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా నీలమ్మ సంబరాలు



ఖంజా మాదిగ వీధిలో కాళీమాత వేషాధారణలో కళాకారుడు

పర్లాకిమిడి: పట్టణంలోని 15వార్డు ఖంజా మాదిగ వీధిలో గ్రామదేవత నీలమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆఖరి రోజు మంగళవారం ఖంజా, మార్కెట్ జంక్షన్ వరకు అమ్మవారి ఘటాలను ఊరేగించారు. విజయనగరానికి చెందిన కాళీమాత వేషాధారణలు, తప్పెటగుళ్లు, చిన్నారుల కోలాటం ఆకట్టుకున్నాయి. బుధవారం అనుపోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



సంబరాల్లో ఆకట్టుకుంటున్న వేషాధారణలు

బైక్ దొంగల అరెస్ట్

బరంపురం: వివిధ ప్రాంతాల్లో అపహరణకు గురైన ద్విచక్ర వాహనాల కేసులకు సంబంధించి గంజాం జిల్లా పోలీసు అధికారులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఐఐసీ అధికారి అభిమన్యు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా పరిధిలో గత కొద్ది రోజులుగా చోటు చేసుకున్న బైక్ దొంగతనాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి.

ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో ఖుర్దా జిల్లాకి చెందిన గొలమ్ హసన్‌ఖాన్, గంజాం జిల్లాకు చెందిన సుశాంత్‌పాత్రొ, రబీంద్రపాత్రొ గుర్తించారు. నిందితుల నుంచి 6 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



పట్టుబడిన దొంగలు, బైక్‌లతో పోలీసులు

భయపెట్టిన పొగ

టెక్కలి రూరల్: బలరాంపురం గ్రామ సమీప రహదారి వెంబడి ఉన్న చెత్త కుప్పలకు మంగళవారం నిప్పు అంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ఏం జరుగుతుందో తెలియక స్థానికులు రెండు గంటలపాటు తీవ్ర ఆందోళన చెందారు. టెక్కలి-పాతపట్నం రహదారి వెంబడి వెళ్లే వాహనదారులు పొగతో అనేక ఇబ్బందులు పడ్డారు. మంటలు వ్యాపించడానికి కారణం తెలియరాలేదు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మహిళలు



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: బొరిగుమ్మ సమితిలో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. ఈ నేపథ్యంలో సమస్యను వెంటనే పరిష్కరించాలని పాత బొరిగుమ్మ గ్రామస్తులు, మహిళలు మంగళవారం మండుటెండలో రాస్తారోకో నిర్వహించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అదే ప్రాంతంలో పర్యటించడంతో అయన్ని చుట్టుముట్టి, సమస్యలను ఏకరవు పెట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇకపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దీంతో మహిళలు శాంతించారు. పాత బొరిగుమ్మ ప్రజలు గత 12రోజులుగా తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. దీంతో ఇటీవల ఆందోళనకు దిగగా.. బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీసు అధికారి వచ్చి నచ్చజెప్పినా వినలేదు. సమితి ప్రతినిధులు ఎవరూ లేకపోవడంతో సమస్యను పరిష్కరిస్తామని ఎస్‌డీపీఓ హామీ ఇచ్చారు. అంగీకరించిన మహిళలు ఆందోళన విరమించారు. అయితే రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వందలాది మంది ఆందోళనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. గ్రామస్తుల వద్దకు చేరుకొని చర్చించారు. వెంటనే పాడైన గొట్టపు బావులను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వాటర్‌హెడ్ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. మెగా నీటి ప్రాజెక్టు పనులు పూర్తయితే తాగునీటి సమస్య కొలిక్కి వస్తుందని, అయితే అధికార పార్టీ నిర్లక్ష్యం కారణంగా పనులు మందకొడిగా జరుగుతున్నాయని ఆరోపించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే సత్కరించారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

హిరమండలం: ఎంఎల్‌పురం పంచాయతీ తాళ్లపాడు వద్ద మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. భగీరథపురం రైస్ మిల్లు నుంచి తాళ్లపాడు గ్రామానికి బియ్యం బస్తాలు ఆటోలో తీసుకొస్తుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన వి.ప్రసాద్, కొత్తగూడకు చెందిన ఏ.గణేష్‌లకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది డి.ముకుందరావు, వి.రాజారావులు ప్రథమ చికిత్స నిర్వహించి కొత్తూరు సీహెచ్‌సీకు తరలించారు.

శరణను వారిని కరుణించేవని..



ఆలయంలో బారులు తీసిన భక్తులు (ఇన్‌సెట్‌లో) నీలమణి దుర్గ అమ్మవారు

● నేడు నీలమణిదుర్గ అమ్మవారికి దేవర జంగెడతో ఆహ్వానం
● భారీ బందోబస్తు ఏర్పాటు

పాతపట్నం: నీలమణి దుర్గ ఉత్సవాలకు భక్తజనం పోటెత్తుతున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత జాతర జరుగుతుండడంతో పాతపట్నంలో పండగ సందడి నెలకొంది. ఉత్సవాల్లో పవిత్ర ఘట్టమైన అమ్మవారిని దేవర జంగెడతో గ్రామంలోకి ఆహ్వానం పలికే కార్యక్రమం బుధవారం జరగనుంది. దీనికోసం హెడ్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కాపువీధిలోని ప్రత్యేక ఆలయం నుంచి దేవర జంగిడతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అమ్మవారిని పుష్పం రూపంలో ఊరిలోకి ఆహ్వానించి కాపువీధిలో ఉన్న ప్రత్యేక ఆలయంలో కొలుస్తారు. అమ్మవారి దేవర జంగెడతోపాటు ఏడు ప్రధాన ఘటాలను ప్రతి రోజూ ఊరేగిస్తారు.

ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర ప్రాంతాలు, రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు పాతపట్నం వచ్చే అవకాశం ఉంది. టెక్కలి నుంచి ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు, శ్రీకాకుళం నుంచి 15 నిమిషాలకు ఒక బస్సు పాతపట్నం చేరుకోవడానికి ఉంటుంది. ఈ నెల 28, 30వ తేదీల్లో రాత్రి 9 గంటల తర్వాత పాతపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న సబ్ కలెక్టర్

పాతపట్నం: నీలమణి దుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో మంగళవారం దర్శించుకున్నారు. అలాగే ఆలయం ఆవరణలో ఉన్న అద్దాల మండపంలో ఊయలలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖ అధికారులకు విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ముందుగా ఎమ్మెల్యేకు, సబ్ కలెక్టర్‌కు పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలోని అద్దాల మండపంలోని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

కొత్తగా 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



పెద్దపండుగకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు కొత్తగా 15 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. పండుగలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ నుంచి రూ.93 లక్షలు నిధులు మంజూరైంది. పాతపట్నంలో 12 వీధులకు విద్యుత్ కేబుల్స్, 5 లైన్ వైర్లను ఏర్పాటు చేశాం. ఎస్ఈల ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తాం. – జీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, డీఈ, విద్యుత్ శాఖ, పాతపట్నం

భారీ బందోబస్తు



అమ్మవారి పెద్ద పండుగల్లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. సుమారు 450 మంది పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ ఫోర్స్ పది రోజులూ విధుల్లో ఉంటారు. పాతపట్నం నగరానికి శివారుల్లో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రత్యేక మొబైల్ పార్టీలను, ప్రతి వీధికి ఇద్దరు కానిస్టేబుల్స్, ఎస్ఐ నిరంతరం పర్యవేక్షిస్తారు. 24 గంటల పాటు పోలీస్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాం.

– ఎం.వినోద్‌బాబు, సీఐ, పాతపట్నం

‘శిక్షణ సద్వినియోగం చేసుకోండి’

టెక్కలి రూరల్: వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు) శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. స్థానిక జిల్లాకేంద్ర ఆస్పత్రిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ఆమె హాజరయ్యారు. అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స, పాముకాటు, ఐవీ ఇన్‌ఫ్యూజన్, లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో చేపట్టాల్సిన విధులను వివరించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరిండెంటెంట్ బొడ్డేపల్లి సూర్యారావు, సీనియర్ వైద్యులు శ్రీరాములు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను పెంపొదిస్తున్నాయని జస్టిస్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, ఇతర న్యాయమూర్తులు ఎంఎస్ ఫణికుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జడ్జి పి.భాస్కరరావు, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బంగారం నగలు, నగదు అపహరణ



దొంగతనం జరిగిన ప్రాంతంలో విచారణ చేస్తున్న పోలీసులు

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లిలో జాతీయ రహదారి26ను ఆనుకుని ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు నగలతో పాటు నగదును అపహరించుకు పోయారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహంతి కృష్ణ ఇంట్లో 4 తులాలు బంగారు ఆభరణాలతో పాటు, 5 తులాల వెండి వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపామని ఎస్సై ఎస్.రవి తెలిపారు. బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావుతో పాటు పోలీసు సిబ్బంది దర్యాప్తు నిర్వహించడంతో పాటు దొంగతనం జరిగిన ప్రాంతాన్ని, పరిసరాలను పరిశీలించి వివరాలు సేకరించామని ఎస్సై వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



రామకృష్ణ మృతదేహం

గంట్యాడ: మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి రామకృష్ణ(34) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రామకృష్ణ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో పరదేశమ్మ పండగ 22,23,24 తేదీల్లో చేస్తుండడంతో బంధువులందరినీ పండగకు పిలిచాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న మోటారు పాడవడంతో బాగు చేయించి తెచ్చాడు. మంగళవారం ఉదయం మోటార్ ఆన్ చేయగా నీరు తక్కువగా రావడంతో బాగు చేయడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కింద డిపోయాడు. వెంటనే సోదరుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి పడిపోయిన రామకృష్ణను 108 అంబులెన్సులో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రికి చేరిన కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పండగ వేళ కుటుంబ పెద్ద చనిపోవడంతో భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఆటోను లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న ఆనంద్

పార్వతీపురం: సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన బోనెల ఆనంద్ పార్వతీపురంనుంచి చినభోగిలికి ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా మరిపివలస ముందు ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీ కొంది. ఈఘటనలో ఆటో తిరగబడిపోయింది. అయితే ఆటోలో ప్రయాణికుల ఎవరూ ఆ సమయంలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆటో నడుపుతున్న ఆనంద్‌కు పలుచోట్ల గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సారా స్థావరాలపై దాడి

పాచిపెంట: మండలంలోని గొట్టూరు పంచాయతీ దిగువ గొట్టూరు సమీపంలో సారా బట్టీలపై మంగళవారం దాడులు చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా కాస్తూ పట్టుబడిన శెబీ వెంకటరావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధి 3వ వార్డు ఎన్‌.కె.రాజపురంలో ఇటీవల జరిగిన ఘర్షణలో ముడిదాన మోహన్‌రావు ఆదే ప్రాంతానికి చెందిన చందక శివశంకర్‌పై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ క్రమంలో మంగళవారం నిందితుడికి న్యాయస్థానం 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు



అదృశ్యమైన సీమోను

విజయనగరం క్రైమ్: ఆడుకుందామని బయటకు వెళ్లిన పదేళ్ల బాలుడు కనిపించకుండా పోయినట్లు తల్లిదండ్రులు వన్ టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదుచేశారు. గాజులరేగకు చెందిన పదేళ్ల సీమోను ఆరెంజ్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, సోమవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 7396177755, 8465055876 నంబర్లను గానీ వన్‌టౌన్ పోలీసులకు గానీ సంప్రదించాలని వన్‌టౌన్ పోలీసులు కోరారు.

స్త్రీనిధితో జీవనోపాధి !



స్త్రీ నిధి రుణాల కోసం సమావేశమైన మహిళలు

- ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న మహిళలు
- ఒక్కో గ్రూప్‌కు రూ.7లక్షల రుణం

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటోంది. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా పొదుపు సంఘంలో సభ్యులైన మహిళలకు స్త్రీ నిధి ద్వారా జీవనోపాధి కోసం రుణాలను అందజేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రుణం చాలా తక్కువగా ఉండేది. ఒక్కో గ్రూప్‌కు లక్ష రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో గ్రూపులో ఏడుగురు సభ్యులకు లక్ష చొప్పున రూ.7 లక్షలు ఇస్తున్నారు. దీనిపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్త్రీనిధి రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలను స్త్రీ నిధి రుణాలు అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నాయి. కొందరు పిల్లల చదువులు, వివాహాలకు, మరికొందరు జీవనోపాధికి వినియోగించుకుంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 19,699 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో సుమారు 2,28,749 మందికి పైగా మహిళలు రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్త్రీ నిధి రుణాలు నలుగురు నుంచి ఐదుగురు సభ్యులకు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున మొత్తం లక్ష రూపాయలు మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక్కో మహిళ లక్ష రూపాయల వరకూ తీసుకునే సౌలభ్యం కల్పించారు. గ్రూపులో ఏడుగురు సభ్యులకు మొత్తం రూ.7లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. అంతేగాక లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పైసా ఖర్చు, తిరిగే పనిలేకుండా..

మహిళల జీవనోపాధి పెరిగేలా ప్రస్తుతం అతి తక్కువ శాతం వడ్డీపై స్త్రీ నిధి రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా బ్యాంకుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంటి నుంచే రుణాలు పొందే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు కూడా లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 72 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే రూ. 3.2 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. రుణం తీసుకున్న మహిళ మరణిస్తే భారం ఇతర సభ్యులపై పడకుండా ఆమె చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తున్నారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నారు. రుణాలు తీసుకుని చెల్లించే వడ్డీతో స్త్రీ నిధి సంస్థకు లాభాలు వస్తున్నాయి. వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని గ్రామ సంఘాలు (వీఓఏ), మండల సమాఖ్యలకు కేటాయిస్తున్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మహిళల జీవనోపాధి అభివృద్ధి కోసం ప్రభుత్వం స్త్రీ నిధి రుణాలు ఇస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 19,699 వేల మంది సభ్యులకు రూ.72 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటికే రూ.3.2 కోట్లకుపైగా రుణాలు అందజేశాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆసక్తి ఉన్న రంగాల్లో ఈ నిధులను పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి.

– పి.కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

జగనన్న పాలనలో అన్ని వర్గాల సంతోషం

- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: జగనన్న పాలనలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పిట్టాడ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పథకాల లబ్ధితో కూడిన బుక్‌లెట్‌లను వారికి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలను పేదవాడి చెంతకు చేర్చి ప్రతి అడుగులో అడుగైనడిచిన జగనన్నకు ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కులం,మతం,ప్రాంతీయ భేదం లేకుండా సంక్షేమ ఫలాలను అందించిన జగనన్న పాలనలో ప్రతి ఇంటికి అందుతున్న లబ్ధిని వివరిస్తుంటే లబ్ధిదారులు బావోద్వేగానికి గురై వారి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. పేద,బడుగు, బలహీవర్గాలకు అండగా ఉంటున్న జగనన్నను మళ్లీ సీఎం చేసే బాధ్యత మనందరిపైనా ఉందని స్పష్టం చేశారు



వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న రాజన్నదొర

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలో శతశాతం హామీలను అమలుచేసి ప్రజల గుండెల్లో తమ పెద్దకుమారుడిగా నిలినిపోయిన జగన్ మోహన్ రెడ్డి పాలన శభాష్ అని దేశమంతా కోడైకూస్తోందని డిప్యూటి సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాటుగేళ్లు పూర్తయిన సందర్భంగా పిట్టాడలోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ కాపారపు నాయుడు బాబు, కొప్పలవెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ రెడ్డి గౌరి,ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లెంకరత్నాకర్‌నాయుడు, రెడ్డి రాజప్పల నాయుడు, చొక్కాకుల సన్యాసినాయుడు, కనిమెరక త్రినాథ్, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబుతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల కల్పన

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని పారిశ్రామిక సంస్థలు తమ లాభాల నుంచి కార్పొరేట్ సామజిక బాధ్యత కింద ఖర్చు చేసే నిధులతో జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పరిశ్రమలకు ఖర్చు చేసే సీఎస్ఆర్ నిధులను ఈ కార్యక్రమాలకే వినియోగించేలా ఆయా యాజమాన్యాలతో సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె పరిశ్రమలశాఖకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఆస్పత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు, హాస్టళ్ల పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతర వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు తమకు వచ్చే లాభం నుంచి 2 శాతం నిధులను సీఎస్ఆర్ కింద వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఆ నిధులను సమీకరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సీపీఓ బాలాజీ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శనం, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

తమ్ముడే కాలయముడు

- కత్తితో అన్నను పొడిచి హత్య



తమ్ముడు చేతిలో హత్యకు గురైన అన్నయ్య పాలక ఇండియా



దర్యాప్తు చేస్తున్న ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, సిబ్బంది

కురుపాం: తోడబుట్టిన తమ్ముడే అన్నయ్యను కత్తితో హతమార్చాడు. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే కురుపాం మండలంలోని జి శివడ పంచాయతీ వేపమానుగూడ గిరిజన గ్రామంలో సోమవారం రాత్రి పాలక ఇండియా (30) గొంతుపై తమ్ముడు పాలక మిన్నారావు కత్తితో పొడిచి హత్యచేశాడు. ఈ నెల 20 వతేదిన పాలక ఇండియా తమ్ముడు పాలక మిన్నారావుకు వివాహం జరగగా పెళ్లికి సంబంధించి ఖర్చులు, సారె నిమిత్తం ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. తీవ్ర కోపంతో అన్నయ్య ఇండియాపై ఉన్న మిన్నారావు సోమవారం సాయంత్రం కత్తితో పొడిచి హత్యకు పాల్పడి పరారయ్యాడు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపువురం ఇన్‌చార్జ్ ఎస్సై షణ్ముఖరావులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు



విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోతున్న ఇల్లు

వంగర: మండల పరిధి గీతనాపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గ్రామానికి చెందిన రేగిడి లక్ష్మణదొర ఇల్లు అగ్నికి ఆహుతైంది. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణదొరను ఆదుకోవాలని సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య అధికారులను కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మరో ఇల్లు..

కురుపాం: మండల కేంద్రంలోని మంతినవలస కాలనీలో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా బచ్చల మోహన్‌రావుకు చెందిన ఇంట్లో సామగ్రి కాలిబూడిదైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో మంటల వ్యాప్తిని గుర్తించిన స్థానికులు గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వెంటనే చేరుకున్న వాహనం మంటలను నివారించి ఇతర ఇళ్లకు చేరకుండా అడ్డుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ మెరకయ్యలు సంఘటనా స్థలానికి వచ్చి ఏ మేరకు ఆస్తినష్టం జరిగిందో గుర్తించారు. ఈ ప్రమాదంలో బంగారం, నగదు, ఫ్రిజ్, బట్టలు, ఇన్వర్టర్ కాలి బూడిదైనట్లు గుర్తించారు.

చిన్నారికి ఆర్థిక సాయం

- రూ.లక్ష చెక్కును అందజేసిన జేసీ మయూర్ అశోక్



చిన్నారి హేమలత తల్లి లావణ్యకు చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం ఫోర్ట్/రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి స్పందన మేరకు రేగిడి ఆముదాలవలస మండలం కందిశ గ్రామానికి చెందిన చిన్నారి పొనగంటి హేమలత చికిత్స నిమత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన ఆర్థిక సాయాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం అందజేశారు. ఇటీవల భోగాపురం విచ్చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని చిన్నారి హేమలత తల్లిదండ్రులు కన్నబాబు, లక్ష్మీ లావణ్యలు కలిసి పాప సమస్యను విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు రూ. లక్ష చెక్కును జాయింట్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ గణపతిరావు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, సామాజిక కార్యకర్త సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

10కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: నియోజకవర్గ ప్రధాన కేంద్రం ఎస్.కోటలో పోలీసులకు మంగళవారం 10కిలోల గంజాయి పట్టుబడింది. ఎస్సై తారకేశ్వరరావు చెప్పిన వివరాల మేరకు స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఆపి సోదా చేయగా 10కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పట్టుబడిన నిందితుడిని డుంబ్రిగూడ మండలానికి చెందిన వంతల ఆనందరావుగా గుర్తించి అదుపులోకి తీసుకుని డిప్యూటీ తహసీల్దార్ వీఆర్వో సమక్షంలో కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై చెప్పారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణమూర్తి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- సర్వజన, ఘోషాస్పత్రులను తనిఖీ చేసిన కలెక్టర్ నాగలక్ష్మి
- చికిత్స, మందులు, వైద్య సేవలపై ఆరా..



ఘోషాస్పత్రిలో వైద్య సేవలపై రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఘోషాస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఏమ్మా బాగున్నావా.. వైద్యులు బాగా చూస్తున్నారా.. ప్రేమగా మాట్లాడుతున్నారా.. రోజూ వస్తున్నారా.. మందులన్నీ ఇస్తున్నారా.. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా అంటూ కలెక్టర్ నాగలక్ష్మి ఘోషాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని పిల్లలవార్డులు, ఆపరేషన్ థియేటర్, స్కానింగ్ సెంటర్, ల్యాబ్, ఈసీజీ, ఐసీయూ, ప్రీ ఆపరేషన్ వార్డు, పోస్టు ఆపరేషన్ వార్డు, ఎస్ఎన్‌సీయూ తదితర అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి విజ్ఞప్తిమేరకు ఏసీలు, డెస్క్ టాప్‌లు, ప్రింటర్లు, స్కానర్లు సి-టాప్, వెంటిలేటర్లు తదితర పరికరాలు అందజేస్తామన్నారు. జనరేటర్‌కు ఆటో స్విచ్ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. ఆ తర్వాత ఆధునీకరించిన ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, ఓపీ, వార్డులను, స్కానింగ్ ఎక్స్‌రే, బ్లడ్ బ్యాంక్, ల్యాబొరేటరీలను పరిశీలించారు. సీహెచ్‌సీలు నుంచి సిటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌ల కోసం రిఫర్ చేసేవారికి స్కాన్ తీస్తున్నారా లేదా అని టెక్నీషియన్ సతీష్‌ను అడగగా తీస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. వైద్యుల విజ్ఞప్తి మేరకు కల్చర్ ల్యాబ్ మెటీరియల్, ఇతర విభాగాల నిపుణులు, ఐటీడీఏ కిట్స్, జనరేటర్, బయోమెట్రిక్ పరికరాలు, నెట్ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వైద్యాధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా ఆస్పత్రి కొత్తగా సర్వజన ఆస్పత్రిగా రుపాంతరం చెందడం వల్ల మొదట్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని, వాటిని సానుకూలంగా పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బొత్ససంతోష్, ఆర్ఎంఓలు లక్ష్మణరావు, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


పార్వతీపురం: ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఆదర్శ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మక్కువ మండలంలోని మునక్కాయవలస, సాలూరు మండలం పురోహితునివలస, భామిని, కురుపాం కళాశాలల్లో ఇంటర్మీడియట్ మెదటి సంవత్సరంలో ప్రవేశించిన వారికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఉచిత విద్యను అందించనున్నామని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను హెచ్‌టిటిపిఎస్://ఏపిఎంఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో జూన్ 7లోగా పంపించాలని వివరించారు.

26 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో ఈ నెల 26నుంచి ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ దివంగత బొత్స కిశోర్ జ్ఞాపకార్థం మూడు రోజులపాటు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆసక్తి గల వాలీబాల్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన వచ్చని ఆహ్వానించారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన మొదటి నాలుగు జట్లకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌పై మరిన్ని వివరాలకు ఫోన్ 9398354173, 8919549679, 9010366148 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సివిల్స్‌లో మెరిసిన పెదవేమలి కుర్రాడు

- సివిల్స్ ఫలితాల్లో 772 ర్యాంకు సాధన
- తండ్రి ఆర్టీసీలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్, తల్లి గృహిణి



భార్గవ్

గంట్యాడ: సివిల్స్ ఫలితాల్లో గంట్యాడ మండలం పెదవేమలికి చెందిన యువకుడు పొటుపురెడ్డి భార్గవ్ ప్రతిభ చూపాడు. 772 ర్యాంకు సాధించాడు. ఐఆర్ఎస్‌గాని ఐఎఫ్ఎస్ గాని వచ్చే అవకాశం ఉంది. తండ్రి సత్తిబాబు విజయనగరం ఆర్టీసీలో సెక్యూరిటీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మావతి గృహిణి. భార్గవ్ చిన్నప్పటి నుంచి చదవులో ముందుండేవాడు. కష్టపడి చదివేవాడు. 1 నుంచి 10వ తరగతి వరకు విజయనగరంలోని భాష్యం స్కూల్‌లోను, ఇంటర్మీడిట్ విశాఖపట్నంలోని చైతన్య కళాశాలలో చదివాడు. బీటెక్ విద్యను ముంబయి ఐఐటీలో పూర్తి చేశాడు. అనంతరం కేంద్రప్రభుత్వ ఉద్యోగంలో చేరి ఆరో నెలలపాటు పనిచేశాడు. అనంతరం సివిల్స్‌పై ఉన్న ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి పరీక్షకు సన్నద్ధమయ్యాడు. ఇప్పటివరకు నాలుగు సార్లు రాశాడు. ఐదో ప్రయత్నంలో 772 ర్యాంకు సాధించాడు.

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం

ఐఏఎస్ సాధించాలన్నదే నా లక్ష్యం. దీనికోసం కష్టపడి చదివాను. ప్రస్తుతం 772వ ర్యాంకు వచ్చింది. ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)గాని, ఇండియన్ ఫారెస్టు సర్వీస్ (ఐఎఫ్ఎస్)గాని వచ్చే అవకాశం ఉంది.

– పొటుపు రెడ్డి భార్గవ్, పెదవేమలి, గంట్యాడ మండలం

జాతీయ స్థాయి హాకీ పోటీలకు చందు



జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన చందు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాలుర హాకీ పోటీలకు విజయనగరానికి చెందిన గండి చందు ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబర్‌లో విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు అర్హత సాధించిన చందు తాజాగా ఈ నెల 19 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలలో జరగబోయే పోటీల్లో పాల్గొనగా.. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న చందు బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకున్నాడు.

అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



సాగుతున్న క్రికెట్ ఎంపిక పోటీలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్జీస్టేడియంలో అండర్-14 బాలుర ప్రాపబుల్స్ జిల్లా జట్టు ఎంపిక పోటీ లు మంగళవారం జరిగాయి. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 42 మంది క్రీడాకారులు హాజరుకా గా 26 మందితో కూడిన ప్రాపబుల్స్ జట్టును ఎంపిక చేశారు. వీరి మధ్య పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది సభ్యు లతో కూడిన జిల్లా జట్టును ఎంపిక చేస్తా మని వీడీసీఏ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. ఎంపిక పోటీలను సెలెక్టర్లు బంగారాజు, వర్మ, సర్ఫరాజ్‌లు పర్యవేక్షించారు. ఎంపిక పోటీల్లో కోచ్‌లు చంద్రశేఖర్, చందక రమేష్, తదితరు లు పాల్గొన్నారు.